క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి

పీలేరు రూరల్ : పుస్తక పఠనంతో విజ్ఞానాని పెంపొందించుకోవచ్చునని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితాన్ని మరింత అర్థవంతం చేయడంలో పుస్తకాలు కీలక పాత్ర పోషించాయన్నారు. మనిషికి నిజమైన స్నేహితుడు పుస్తకమేనన్నారు. ప్రపంచ మేధావులు, గొప్పవారంతా మంచి పుస్తకాలు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆనంద్, గ్రంథాలయ అధికారి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల నివారణపై అవగాహన



పరిశుభ్రతపై వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

ములకలచెరువు : మండలంలోని వేపూరికోట, దేవలచెరువు గ్రామాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు జ్వరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన పీహెచ్‌సీ సిబ్బందితో కలసి ఇళ్ల పరిసరాలను క్షుణంగా పరిశీలించారు. మురికి నీరు నిల్వ ఉంచరాదని, డ్రమ్ములు, సంపుల్లోని నీటిని వారానికోసారి శుభ్రం చేయాలని లేకుండా దోమల ద్వారా జ్వరాలు ప్రబలుతాయని ప్రజలకు వివరించారు. ఎంపీహెచ్‌ఈఓ ప్రవీణ్‌కుమార్, ఏఎన్‌ఎం పద్మా, ఆశా వర్కర్లు రేణుకా, తాజూన్‌బి పాల్గొన్నారు.

రేపు సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవసభ

కేవీపల్లె : చిత్తూరులో ఆదివారం నిర్వహించనున్న సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవసభను విజయవంతం చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ కోరారు. శుక్రవారం మండలంలోని సీకేఆర్‌పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగులు ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, శ్రీనివాసులు, వేణు, కృష్ణ, సుబ్రమణ్యం, మురళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా పొత్తూరి శ్రీకాంత్

కలకడ : బీజేపీ పీలేరు అసెంబ్లీ కన్వీనర్‌గా కలకడ మండలానికి చెందిన డాక్టర్ పొత్తూరి శ్రీకాంత్‌నాయుడును ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో పొత్తూరి శ్రీకాంత్‌నాయుడు నియమించినట్లు తెలిపారు. అతడు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి, కేంద్రపథకాలు ప్రజలకు తెలియజేయడానికి కృషి చేస్తానన్నారు.

సామాజిక న్యాయ సారథి సీఎం జగన్

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : అన్ని సామాజిక వర్గాల్లో వివక్షకు గురైన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో న్యాయం జరిగిందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శివపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా ఇచ్చిన ఓటును ప్రజలు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఇస్తే..ఆయన తన నాలుగున్నరేళ్ల పాలనలో సామాజికంగా, ఆర్థికంగా విద్యాపరంగా, నివాసపరంగా ఆత్మాభిమానం చాటుకునేలా అన్ని వర్గాలకూ స్థానం కల్పించారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సుస్థిర, సంక్షేమ పాలన సాకారమవుతోందన్నారు. పార్టీ శ్రేణులంతా ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. నాలుగున్నరేళ్లుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి లబ్ధిదారులకు నేరుగా సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు అన్నివర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఈఓ ఉదయ్ కుమార్, నాయకులు కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, రాయుడు, షాహెద్, రాజు, ఈశ్వర, వేణుగోపాల్, సుధాకర, రాజేష్, శివారెడ్డి, వెంకటేష్, గోపాలక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలయానికి భూమి పూజ

వాల్మీకిపురం : పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీ సమీపంలో శ్రీ గాయత్రి దేవి ఆలయానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమాలు చేశారు. కార్యక్రమంలో చింతల ఆనంద రెడ్డి, కరమల శంకరాచారి, విజయ్ కుమార్ ఆచారి, మస్తాన్ ఆచారి, మదనా ఆచారి, రవీంద్ర బాబు, శ్రీరామాచారి, శివయ్య, ఆనంద, తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువు సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్

పీలేరు : నవజాత శిశువు సంరక్షణ అందరిబాధ్యత అని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ నల్లగుట్ట అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ నవజాత శిశువు వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజాత శిశువు జీవిత కాలాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందించే దిశగా ప్రతి తల్లికి, కుటుంబ సభ్యులకు సంపూర్ణ అవగాహన అవసరమని అన్నారు. నవంబర్ 15 నుంచి 21వ తేదీ వరకు గ్రామ సచివాలయాల వారీగా గుర్తించిన నవజాత శిశువులను స్థానిక ఆరోగ్య సిబ్బంది సలహాలు, సూచన తోపాటు లోపాలను గుర్తిస్తారని తెలిపారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవావలన్నారు. తల్లి వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎం విజయకుమారి, సీహెచ్‌వో ఆయేషా, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

వాల్మీకిపురం : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 9:30గంటలకు కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్ తెలిపారు.

కలికిరి : కలికిరి పరిధిలోని రాజువారిపల్లి సమీపంలో అజయ్ ఫంక్షన్ హాలులో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

22న మండల సమావేశం

కలికిరి : మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న ఉదయం 11 గంటలకు ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. మండలంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు, చేపట్టబోయే పనుల ప్రణాళికలతో అన్ని మండల శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరవ్వాలన్నారు. కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

జగనన్న గోరుముద్ద విద్యార్థులకు వరం

ఎంఈఓ నారాయణ

నిమ్మనపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం విద్యార్థులకు వరమని ఎంఈఓ–2 నారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని దిగువమాచిరెడ్డిగారిపల్లె, రాచవేటివారిపల్లె పాఠశాలలో, ప్రభుత్వం మంజూరు చేసిన మధ్యాహ్న భోజన పథక సామగ్రిని సర్పంచ్ సుబ్రహ్మణ్యంతో కలిసి పాఠశాల హెచ్‌ఎంలు భాస్కర్ రెడ్డి, జయరామిరెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందుతోందన్నారు. ప్రతిరోజు నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పి పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు పాపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాముని అక్షింతలు ఊరేగింపు

మదనపల్లె సిటీ : అయోధ్య రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో కలశంలో రాముని అక్షింతలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక అనపగుట్టలోని లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాల కొనసాగింపు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలికిరి : రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్ళీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డినే గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ అన్నారు. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా నేరుగా ప్రజలకు మేలు చేకూరుస్తున్న జగన్‌ను మళ్లీ గెలిపించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. సచివాలయ ఆవరణలో సంక్షేమ పథకాల డాష్ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు శివాజీ, జేసీఎస్ మండల కన్వీనర్ రెడ్డెప్ప, నాయకులు బాబురెడ్డి, మల్లికార్జున, రామక్రిష్ణ, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా ప్రచారం

ములకలచెరువు : తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించి తలపెట్టిన కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం ప్రచార రథం శుక్రవారం ములకలచెరువుకు చేరుకుంది. ప్రచార రథం పలూ వీధుల్లో ప్రజలకు దర్శన భాగ్యం కల్పించగా భక్తులకు లాకెట్లు వితరణ చేసి హనుమాన్ చాలీసా పఠనందీక్ష గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గంఘదరప్ప స్వామి, రవీంద్ర,ఆంజినేయులు, శ్రీరాములు పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన



మాట్లాడుతున్న తహసీల్దార్ ధనుంజయులు

పీలేరు : మండలంలో కులగణన పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ ధనుంజయులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కులగణనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వారం రోజుల లోపు కులగణన మొదలుపెట్టి డిసెంబర్ 10లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి, ఏఎస్‌వో రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవితలు

మదనపల్లె సిటీ : ప్రముఖ కవులు వినిపించిన కవితలు ఆకట్టుకున్నాయి. స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు రామమోహన్‌రెడ్డి, కుమారస్వామి, నాగరాజు, టి.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి, యుగంధర్, హేమలత, శ్రీనివాసులు కవితలు వినిపించారు. ప్రముఖ కవి వేంపల్లె అబ్దుల్‌ఖాదర్ విలువైన వంద పుస్తకాలను గ్రంథాలయానికి ఉచితంగా అందజేశారు. అనంతరం కవులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వసంతకుమారి, తిరుపతిరావు, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభ ప్రచార పత్రాలు ఆవిష్కరణ

నిమ్మనపల్లె : మాల మహానాడు విజయోత్సవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా జాయింట్ సెక్రటరీ వీరనాల మాణిక్యం కోరారు. మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీలో విజయోత్సవ మహాసభ ప్రచార పత్రికలను ఆవిష్కరించారు. మాల మహానాడు స్థాపించి 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈనెల 19న మదనపల్లె పట్టణంలోని జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో విజయోత్సవ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత కంటి పరీక్షలు

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం దృష్టి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితగా కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు జ్యోతి, విష్ణుప్రియ, వనజ,నమ్రత, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత దండుమారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో దండుమారెమ్మతల్లి

తంబళ్లపల్లె : మండలంలోని కన్నెమడుగులో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామదేవత దండుమారెమ్మ విగ్రహా ప్రాణప్రతిష్ఠ మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సర్పంచు శ్యామలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మహేష్‌లు తెలిపారు. గ్రామస్తులు దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. వేదపండితులు కుమారస్వామి బృందం మూడు రోజుల పాటు యజ్ఞయాగాలు, హోమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించి ఆదివారం అమ్మవారి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేస్తారన్నారు. శుక్రవారం అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణ చేసి పంచాయితీలోని అన్ని పల్లెల్లో ఊరేగింపు నిర్వహించారు.

ఉపాధి కూలీలకు అదనపు పనిదినాలు

తంబళ్లపల్లె : గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఉపాధి కూలీలకు అదనంగా 50 రోజులు పని కల్పిస్తున్నట్లు ఏపీడీ మధుబాబు తెలిపారు. రేణుమాకులపల్లె పంచాయతీ మిట్టమాలపల్లెలో శుక్రవారం ఉపాధి కూలీలకు అవగాహన సదస్సు జరిగింది. కరువు మండలంగా తంబళ్లపల్లెను ప్రకటించడంతో కూలీలకు ఎక్కువ పనులు కల్పించేంలా అదనంగా మరో 50 రోజుల పనిదినంతోపాటు రూ.270 గిట్టుబాటు ధర కల్పిస్తున్నామన్నారు. అలాగే రైతులకు ఉపయోగకరమైన పనులు కల్పిస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో అంజనప్ప, ఉపాధి ఇంజనీరు రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

పెద్దతిప్పసముద్రం : డ్వామా క్లస్టర్ ఏపీడీ మధుబాబు ఆదేశాల మేరకు ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉపాధి హామీ సిబ్బంది శుక్రవారం పలు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించడమే ఉపాధి లక్ష్యమని ప్రజలకు వివరించారు. పని కోరడం మీ హక్కు–పని కల్పించడం మా హక్కు కార్యక్రమంలో భాగంగా సన్న, చిన్న కారు రైతులకు ఉపాధి హామీ ద్వారా రాయితీతో పండ్ల, పూల తోటల సాగు చేసే విధానం పై అవగాహన కల్పించారు.

సమగ్ర భూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

కలకడ : మండలంలోని కోన పంచాయతీలో చేపట్టనున్న సమగ్ర భూ సర్వేను రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జిల్లా రాజగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రదీప్ కోరారు. శుక్రవారం సర్పంచ్ జిల్లా రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రైతులు, సచివాలయ సర్వేయర్, మండల సర్వేయర్‌లు పాల్గొన్నారు. ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేయడం వలన రైతులు కొనుగోలు చేసిన భూములు, ఆక్రమణలు, ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు రిజిష్టర్ అయిన భూములకు కొలతలు తీసి ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. ప్రభుత్వ భూములను రక్షించడం, ఆక్రమణలు తొలగించడానికి అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఘర్షణలు లేకుండా నిజమైన భూ హక్కు దారులకు భూ హక్కు పత్రంతో పాటు డిజిటల్ పట్టాదార్‌పాస్‌బుక్ మంజూరు చేస్తారన్నారు. భూమికి హద్దులు నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ముందుగా సమాచారం ఇచ్చి కొలతలు, సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తారన్నారు. జగనన్న భూ రక్ష కార్యక్రమం పూర్తి చేయడానికి సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రవిచంద్రన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ నందకుమార్‌రెడ్డి

పీలేరు రూరల్ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ నందకుమార్‌రెడ్డి అన్నారు. పీలేరు, కేవీపల్లె మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సప్లయ్‌చానల్లు, హార్టికల్చర్, ఫారంఫండ్స్ పనులను పరిశీలించారు. రెండు మండలాల్లో 3200 మంది పని చేస్తున్నారని తెలిపారు. రైతులకు పశుగ్రాసం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మహేశ్వర్, జేఈ సుధాకర్, టీఏ రియాజ్, ఎఫ్‌ఏ సందీప్ పాల్గొన్నారు.

పీటీఎంలో వరుస చోరీలు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో జరుగుతున్న వరుస చోరీల కారణంగా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బుధవారం రాత్రి ఇంటి ఆవరణంలో నిలిపి ఉన్న పల్సర్ బైక్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు.

గురువారం రాత్రి మద్దయ్యగారిపల్లి రోడ్డులో ఉన్న రైస్‌మిల్‌లో నిల్వ ఉంచిన మూడు పాత సబ్‌మెర్సిబుల్ మోటార్లతో పాటు మరి కొన్ని పరికరాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనలో రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఇరువురు బాధితులు చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే చోరీల కారణంగా రాత్రి వేళ కంటి మీద కునుకు లేకుండా జాగారం చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. పోలీసులు రాత్రి వేళ గస్తీ నిర్వహించి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజల వద్దకే పాలన చేరుతోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని పోతబోలు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు సర్పంచ్ ఈశ్వరయ్య, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందజేసిన పథకాలను వివరించారు. లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. పారదర్శకంగా పథకాలు అందిస్తూ, సుపరిపాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూనే...మరో పక్క అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాల పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య గల తేడాను ప్రజలు గుర్తించి, జగనన్న ప్రభుత్వానికి మద్దతు తెలపాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి, జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.